మృత్యుగానం

— వుప్పల నరసింహం

తెలంగాణాలో అదొక ఊరు.

ఆ ఊరి పేరు గుమ్మడిదాల.

తెలంగాణా ప్రాంతంలో బాగా వెనక బడిన ప్రాంతంలో అదొక గ్రామం. అన్ని గ్రామాల్లో మాదిరిగానే ఆ గ్రామంలో ఆచారాలు, వ్యవహారాలు, సాంప్రదాయాలు, పండుగలూ పబ్బాలూ ఎక్కువ భక్తిశ్రద్ధలతో పాటిస్తారు.

గుమ్మడిదాల గ్రామంలో పలుకుబడి గల ధనిక రైతు రామిరెడ్డి ఇంటి ముందు

అలల మాదిరి గొంతులు పొంగి పొర్లుతున్నాయి. కెరటాల్లా అందెలు ఘోషిస్తున్నాయి. నాగు పాము బుసలా తాంబూరతీగెల చప్పుడు వినిపిస్తున్నది. కత్తి పోటులను ఎదుర్కొంటున్న డాలులా "డిమ్కి" మ్రోగుతున్నది. వాయిద్యాల ధ్వని గంభీరమైన గాత్రంతో మిళితమై ప్రేక్షకుల నరాల మీద దాడి చేస్తుంటే ఈ ప్రపంచంలో ఎక్కడాలేని ఉద్వేగం, తన్మయత్వం మనసులో చోటు చేసుకుంటున్నాయి,

మనసు కరగించి పిడికిళ్ళతో మెత్తగా పిండుతున్న అరుదైన అనుభూతికి "శారదకాళ్ళు" దుర్గయ్య దంపతుల జానపద కళా నైపుణ్యతకు కారణం.

కథలో పూర్తిగా లీనమైన వాళ్ళ ముఖాలలో తన్మయత్వంతో బాటు బాధ, ఆవేదన స్పష్టంగా కనిపిస్తున్నాయి. తక్కువ స్థాయిలో పాటను అందుకొని రాగాన్ని తారాస్థాయికి తీసుకెళ్ళి ప్రేక్షకుల హృదయాలలో చెరగిపోని ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా సూర్యారెడ్డి ఆ జానపద కళాకారుల కళా నైపుణ్యాన్ని చూసి ముగ్ధుడైపోయాడు.

రామిరెడ్డి మేనల్లుడు సూర్యారెడ్డి. పన్నెండు రోజుల క్రితం సూర్యారెడ్డి తాత ముత్తిరెడ్డి మరణించాడు. పదకొండు రోజులకు కావలసిన ఖర్మకాండను రామిరెడ్డి ఘనంగా జరిపించాడు.

సూర్యారెడ్డి హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఎం. ఎ. లిట్ చదువుకున్నాడు. సాహిత్యం అంటే మక్కువ. శ్రీ శ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, కాళీపట్నం రామారావు, చలం, బుచ్చి

బాబు మొదలైన వారి రచనలను బాగా అధ్యయనం చేశాడు. ఎం. ఏ. తరువాత కొడవటిగంటి కుటుంబరావు సాహిత్యంపై పరిశోధనా గ్రంథం వ్రాయాలని ఉబలాట పడుతున్నాడు.

విశ్వ విద్యాలయంలో ఎక్కువ పలుకుబడిగల తీవ్రవాద విద్యార్థి సంస్థలతో సంబంధాలు వున్నాయి. సమాజాన్ని శాస్త్రీయ దృష్టితో పరిశీలించడం సూర్యారెడ్డికి చాలా యిష్టం. సన్నగా ఎత్తుగా నాజూకుగా కనిపించే సూర్యారెడ్డి సుతిమెత్తని మనస్కుడు.

తాత ముత్తిరెడ్డి మరణించాడనే వార్త తెలియగానే తల్లి సరోజనమ్మతో పాటు హైదరాబాదు నుంచి గుమ్మడిదాలకు ప్రయాణమై వచ్చాడు పన్నెండు రోజుల క్రితం.

పదకొండవ రోజు కర్మకాండ ముగిసిన వెంటనే చాలామంది చుట్టాలు వెళ్ళిపోయారు. దగ్గరి చుట్టాలు మాత్రమే ఉండిపోయారు. సూర్యారెడ్డి అమ్మమ్మకు ఊరట కలిగించేందుకుగాను ఆ రోజు సూర్యారెడ్డి తల్లి సరోజనమ్మ ఉండిపోయింది. సరోజనమ్మతో పాటు సూర్యారెడ్డి కూడా వుండి పోయాడు. హాస్టల్లో జరిగిన గందరగోళం వల్ల విశ్వవిద్యాలయ కళాశాలలను పది హేను రోజులు మూసివేశారు. దాంతో సూర్యారెడ్డి గ్రామీణ పరిస్థితులను, వైరుధ్యాలను పరిశీలిస్తూ వున్నాడు గుమ్మడిదాలలో. ముత్తిరెడ్డి మరణించిన పన్నెండో రోజు మధ్యాహ్నం భోజనాలు ముగిసిన తరువాత రామిరెడ్డి ఆ వూరి చివర అర్ధ చంద్రాకారపు గుడిశెలు వేసుకొని, కడు పేదరికంలో నలిగి పోతున్న యాచక వృత్తి "శారదకాళ్ళ" లో ఒకడైన దుర్గయ్యను, ఆయన భార్య పోశమ్మను పిలిపించి తన తండ్రికి ఇష్టమైన "బల్గూరి కొండయ్య కథ" చెప్పమన్నాడు.

దుర్గను, పోశమ్మను చూడగానే పన్నెండు రోజుల క్రితంనాటి సంఘటన గుర్తుకు వచ్చింది. ముత్తిరెడ్డి శవాన్ని ఇంటినుంచి ఊరేగింపుగా తీసుకెళ్తు గ్రామం ప్రధాన మార్గాలన్నీ దాటి ఊరి చివర, చెరువు ప్రక్కన ఎవరి సంరక్షణ లేని మామిడితోట మధ్యనుంచి వున్న బాటనుండి వెలుతుండగా తోటలో ఒక వైపు అర్థచంద్రాకారపు ఈత చాపల గుడిశెలు చెల్లాచెదురుగా వేసివున్నాయి. అక్కడి పిల్లలు నగ్నంగా వున్నారు. మరికొంత మంది అర్ధ నగ్నంగా వున్నారు. స్త్రీలు వక్షస్థలాలపై పైట కొంగు లేకుండా అటు, ఇటు తిరుగుతున్నారు. బలిష్టమైన ఆకారాలు వారివి. పురుషులు కేవలం గోచీ పెట్టుకుని వున్నారు. కండలుదేరిన దేహాలు వారివి. మగవారు స్త్రీలలా శిరోజాలు పెంచుకున్నారు. వేటకు తీసుకెళ్ళేందుకు చెవులు కోసిన కుక్కలు గుడిశెల ముందు వున్నాయి. వాళ్ళ మాటతీరు వేరుగా వుంది. ప్రత్యేకమైన "యాస" ఆ మాటల్లో వుంది. పూర్తిగా సంచార జీవితానికి అలవాటు పడ్డవారిలా వున్నారు వాళ్లు.

శవం ఊరేగింపు వాళ్ళని చేరేసరికి పోటీపడి పరుగెత్తుకొని వచ్చి శవంపై నుంచి ఎగజల్లే చిల్లరడబ్బులను ఏరుకోవడానికి తీవ్రమైన పోటీ పడుతున్నారు



అయితే దూరంగా ఓ స్త్రీ ఐదు సంవత్సరాల పాప తల పట్టుకుని కూర్చుంది. ఆ పాప వాంతి చేసుకుంటూవుంది. కొది దూరంలో 40 సంవత్సరాలతను తలకు చేతులు పెట్టుకుని విచారంగా కూర్చున్నాడు. అతని ప్రక్కన చెవులు కోసిన

వేటకుక్క పడుకున్నది. గుడిశె ముందు కుండలు, వివిధ పాత్రలు, ఈతకమ్మలు, బొంత పేగులు, కర్రలు రోకలి పడి వున్నాయి. ఎప్పుడో వొండిన మూడు రాళ్ళ పొయ్యి ప్రక్కకు వుంది వాళ్లు శవం వైపు రాలేదు. ఆ పాపకు ఓ ముంతతో నీళ్లు తాగించి మొఖంకడిగి బాధగా గుండెలకు అద్దుకుని గుడిశె లోపలికి తీసుకపోయింది ఆ స్త్రీ

ఆ దంపతులే దుర్గయ్య, పోశమ్మ. వాళ్ళే ఇప్పుడు కథ చెపుతున్నారు. పోశమ్మ ఎడమ తొడపై ఆనాడు వాంతి చేసుకున్న ఐదేండ్లపాప అనసూయ నిస్సత్తువగా పడుకుంది. ఆనాటినుంచి ఆ పాప కోలుకున్నట్టు లేదు. నీరసంగా వుంది. దుర్గయ్య కూడ తప్పనిసరిగా కథ చెపుతున్నట్టుగా వుంది. కళ్ళల్లో బాధ స్పష్టంగా కనిపిస్తున్నది. కథ చెప్పే విధానంలో ఆ లోటు రాకుండా జాగ్రత్త పడుతున్నాడు.

బల్గూరి దమ్మవ్వ కన్న కొడుకు బల్గూరి కొండయ్య. ఒకప్పటి పెంపుడు కొడుకు షాకమల్లు. కొండయ్య పుట్టిన వారం రోజులలోనే మొగలాయిలు, వాళ్ళ సామంతులు, పగవాళ్ళు, కొండయ్య తండ్రి రఘుపతిరావు పూజలో వున్నప్పుడు నిరాయుధుణ్ణి చేసి చంపేయడంతో కొండయ్యలో ప్రతీకారవాంఛ చిన్నప్పటి నుంచి చోటు చేసుకుంది.

ఉన్న ఆస్తి పాస్తులతో దమ్మవ్వ కొండయ్యను పెంచి పెద్ద చేస్తుంది. ఏడు సంవత్సరాల వయసు రాగానే కొండయ్య పరాక్రమ వంతుడవుతాడు. అన్ని విద్యలలో ఆరితేరిన వాడవుతాడు. అన్ని సాములు నేరుస్తాడు. తన తండ్రిని చంపిన శత్రువులను సంహరించేందుకు సహాయపడటానికి గాను సోదరుడు శాకమల్లును అతని సైన్యాన్ని తన ఊరికి ఆహ్వానిస్తాడు.

బల్గూరి కొండయ్య ఆహ్వానంపై వచ్చిన శాకమల్లు, అతని సైన్యం ఆకలి, దప్పికలతో ఎలా తల్లడిల్లిందో అన్న సంఘటనను దుర్గయ్య అంత బలంగా ఎలా చెప్పగలిగాడోనని సూర్యారెడ్డి, అక్కడ కూర్చున్నవారందరూ ఆశ్చర్య చకితులయ్యారు. దుర్గయ్య ఆ ఘట్టం చెపుతున్నప్పుడు ఆకలి దప్పికలు అంత క్రూరంగా వుంటాయా? అన్న ఆలోచన సూర్యారెడ్డిలో కలిగింది. ఆకలి గురించి అనేక కథలు కవితలు, వ్యాసాలు చదివిన సూర్యారెడ్డి ముందెన్నడూ స్పందించని రీతిగా దుర్గయ్య 'ఆశుకవిత్వానికి' స్పందించాడు. దుర్గయ్య కళ్ళవెంట నీళ్లు కారుతూ వుంటే సూర్యారెడ్డి కళ్లు చెమ్మగిల్లాయి. హృదయం కరిగిపోయింది. జానపద కళాకారులంటే తన మనసులో చెరగిపోని ముద్ర పడింది. వారికి మనసులోనే జోహార్లు అర్పించాడు.

రామిరెడ్డి ఇంటి ముందువున్న విశాల మైన వసారాలో ఒక మూల దుర్గయ్య. పోశమ్మ కూర్చుని కథ చెబుతున్నారు, పోశమ్మ తొడపై అనసూయ పడుకుని సన్నగా మూల్గుతూ వున్నది.

వాళ్ళకు అభిముఖంగా కొంచెం దూరంలో రామిరెడ్డి, సూర్యారెడ్డి, రామిరెడ్డి తమ్ముళ్లు, ఆ వాడలోని కాపులు, సావుకార్లు, పెద్దలు కూర్చున్నారు. గడప వద్ద సరోజనమ్మ, సరోజనమ్మ తల్లి,



రామిరెడ్డి భార్య కమలమ్మ తదితరులు కూర్చున్నారు.

వసారా క్రింద వాకిట్లో ఆవూరి సామాన్య ప్రజలు కూర్చున్నారు. అందులో ఎక్కువగా నలభై సంవత్సరాలు దాటిన ఆడవాళ్ళు, ముసలి వాళ్ళు వున్నారు. పిల్లలు "నేనే ముంగట కూసుంట" అని తోసుకుంటూ కూర్చుంటున్నారు. ముసలి వాళ్ళు చుట్టలు, బీడీలు కాలుస్తూ పిల్లలను అల్లరి చేయకుండా బెదిరిస్తూ వున్నారు.

దుర్గయ్య పోశమ్మ చేతుల కదిలికలను గమనిస్తూ సూర్యారెడ్డి తదేక దృష్టితో కథ వింటున్నాడు.

దుర్గయ్య, చేతిలో వంద సంవత్సరాల క్రితం నాటి "శారద" నగిషీలతో వున్నది. ఆ శారద (వీణలాంటి వాయిద్యం)కు ఒకవైపు హంసముక్కు చెక్కబడింది. మరో వైపు గుమ్మడి కాయలా వుంది. శారదను ఎడమ భుజానికి మోపుకుని కుడిచేతి చూపుడు వేలితో తీగెలను మీటుతూ, ఎడమ చేతి బొటన వ్రేలుకు కంచు అందెలు మ్రోగుతుండగా కథ చెబుతున్నాడు.

తానే బల్లూరి కొండయ్య అన్నంత ఆవేశంగా తనకు తానే సాటిగా అతి సమర్థవంతంగా, పెంచ్చు గొంతుతో ఉద్వేగంతో, పౌరుషంగా కథలో లీనమై మాటల "బాకులను," "ఈటెలను" ప్రేక్షకుల గుండెల్లో గుచ్చుతున్నాడు దుర్గయ్య.

బుర్రకథకు ఉపయోగించే మట్టికుండ

'డిమ్కి' పోశమ్మ కుడి చేత్తో వాయిస్తూ ఎడమ చేతితో డిమ్కి మూతని మూస్తూ తెరుస్తూ వుంది శబ్ద మాధుర్యం కోసం.

పోశమ్మ చిరిగిన నీర కట్టుకుంది. అతుకుల రవికె తొడుక్కున్నది - మెడలో నల్ల పూసలు వున్నాయి చేతులకు పాత బడిన గాజులు వున్నాయి. కథ చెప్పే టప్పుడు అటూ, ఇటూ తలను ఆడిస్తూ వుండగా ముక్కున వున్న పుడక తళు క్కున మెరుస్తున్నది. విశాలమైన నుదు రుపై కొట్టొచ్చినట్టుగా వున్న కుంకుమ బొట్టు - ఆమె అడవిలోని మోదుగ పువ్వులావుంది.

దుర్గయ్య తలకు రుమాలు. అక్క డక్కడ చిరిగిన ధోవతి. పాత కమీజు వెసుకున్నాడు- పెరిగిన గడ్డంతో వడి చెడు మీసాలతో గంభీరంగా వున్నాడు. చవి పై భాగంలో రాగిపోగు వుంది, అతను కొలిమిలో కాలిన ఇనుపచువ్వలా వున్నాడు.

ముందు కథ ఎలా జరుగనున్నదో అన్న కుతూహలంతో అక్కడ కూర్చున్న వారందరూ నిశ్శబ్దంగా వింటున్నారు. సూర్యారెడ్డి గెడ్డం క్రింద ఎడమ చేతిని పెట్టుకుని దుర్గయ్య కళ్ళ లోతుల్లోని బాధని, రెప్పలేయకుండా చూస్తూ కథ వింటున్నాడు.

దుర్గయ్యగొంతు కథ మధ్యలో సందర్భోచితంగా చటుక్కున ఘర్జిస్తు న్నది. అంత ఆకస్మికంగా సందర్భో చితంగా అలా వీరోచితంగా చెప్పడం వల్లనే అక్కడి ప్రేక్షకులలో జానపద బల్లారి కొండయ్య కథ నాటుకపో తున్నది.

ఏక బిగిగా గంటసేపు కథ చెప్పిన తరువాత దుర్గయ్య శారదను క్రింద పెట్టి, అందెలు క్రిందవేసి, ధోవతి కొనతో కళ్ళు తుడుచుకుని ఆకలి కడు పుకు ధోవతి మరింత గట్టిగా బిగకట్టి

"దూపయితుంది, జెరన్ని నీళ్ళు ఇయ్యండ్రి దొరా." రామిరెడ్డిని చూస్తూ హృదయ విదారకంగా అడిగాడు.

రామిరెడ్డి వెనక్కి చూశాడు-గడపలో వున్న రామిరెడ్డి భార్య కమలమ్మ లేచి ఇంట్లోకి వెళ్ళింది.

పోశమ్మ తన డిమ్కిని క్రిందపెట్టి అనసూయను తన తొడపైనుంచి క్రింద పడుకోబెట్టి కడుపుపై చెయివేసి చూసింది. "శరీరం వెడిగా వుంది" అన్నట్టు దుర్గయ్యవైపు చూసింది. దుర్గయ్య ముందుకువంగి అనసూయను రెండు చేతులతో అందుకుని ఒడిలో కు ర్చో బెట్టుకుని తానూ కడుపుపై చెయివేసి చూసాడు. "నిజంగానే జ్వరం చాలా వుందే" పోశమ్మవైపు చూసాడు. తిరిగి అనసూయ కళ్ళు తెరవకుండానే సన్నగా మూల్గుతూ తండ్రి వొడిలో కరచుకొని పడుకున్నది. దుర్గయ్య అనసూయ నుదురురాస్తూ తన నికృష్టమైన బతుకు గురించి ఆలోచించాడు.

"ఎప్పటికి ఇదేనాయే 'అది' బాగుంటే నేను బాగుండక పోతి, నేను బాగుంటె అది బాగుండకపాయె-ఇద్దరం మంచిగుంటె పోరి బాగుండకపాయే ఉన్నదో, లేనిదో ఇంత తిని గుడిశెల ముందురుకొని పండుకుందా మంటె ఎప్పటికి ఎదో ఒక రోగం, నొప్పి ఉండనే బట్టే చేసిన కష్టం మందు



మాకుకే కావట్టే అయినా పెయ్యిలు (ఆరోగ్యాలు) సరిగ్గా లేకపోయే. పోల్ల వది రోజులల్ల ఎంత గుంజుగపోయింది నూడు .ప్చ్ ఎట్లుండే ఎట్లయింది . శిలొక్కయ్య లెక్క. భగవంతు గుశ్శె పుస్నువొయ్య ఎప్పటికి ఇదే వనవాస మాయె .. ఒక్కనాడన్న నిమ్మళంగ ఉన్నట్టు లేకపోయే .... బతికెకన్న చచ్చింది నయమున్నది ఈనాడల తోటి"

అని స్వగతంలో తన బ్రతుకును బాధలను తిట్టుకున్నాడు. అంతకుమించి ఏమి చేయలేని నిస్సహాయుడు దుర్గయ్య.

పోశమ్మ కడుపులో ఆకలి దహించుక పోతుంటే నాలిక పిడుచ కట్టుక పోతుంటే "ఉమ్మిని" కడుపులోకి మ్రింగుతూ అనసూయ వైపు చూచి కళ్ళ నీళ్లు పెట్టుకుంది. మనసును రంపంతో కోస్తున్నట్టుగా వుంది అనసూయను చూస్తుంటే. అంత మందిలో ఏడ్వడం పద్ధతి కాదనుకొని కొంగుతో కళ్ళు తుడుచుకుంటుండగా గడప వద్ద "ఇగో" అన్న మాట వినిపించి అటువైపు తిరిగింది.

రామిరెడ్డి భార్య కమలమ్మ చెంబులో నీళ్ళు తెచ్చింది.

సూర్యారెడ్డి కూర్చున్న వద్ద నుంచి లేచి గడప లోపల నిలుచున్న అత్తె వద్ద నుంచి నీళ్ళచెంబు తీసుకుని దుర్గయ్య పోశమ్మ కూర్చున్న దగ్గరికి వచ్చాడు. దుర్గయ్య, పోశమ్మను అంత దగ్గరగా చూడటం సూర్యారెడ్డికి ఎంతో ఆనంద మనిపించింది. ఆలాగే వారి పేదరికం చూడగానే గుండె తరుక్క పోయింది.

ఈ అజ్ఞాత జానపద కళాకారుల

గుండెల్లో ఎంతటి విలువైన కళా గనులు దాగున్నాయో? వాటిని ఈ ప్రపంచం ఎప్పుడు తెలుసుకుంటుంది? అన్న ఆలోచనలో పడ్డాడు సూర్యారెడ్డి.

పోశమ్మ తన ప్రక్కనున్న "జోర" లోంచి ఓ బగోని, ఓ అల్యూమినియం గ్లాసు తీసింది. సూర్యారెడ్డి చెంబులోని నీళ్ళు ఆ రెండిట్లో పోసి అనసూయ వైపు ఓ సారి చూసి వెనక్కు తిరిగాడు.

పోశమ్మ దుర్గయ్య ఒడిలోని అనసూయను తీసుకుని బగోని గిన్నె దుర్గయ్య కిచ్చింది. బగోని గిన్నెతో దుర్గయ్య నీళ్ళు తాగుతుండగా స్వరం పడింది. వెంటనే పోశమ్మ దుర్గయ్య ఛాతీలో అరచేతితో రాసింది. కొద్దిసేపు దగ్గి తమాయించుకున్నాడు దుర్గయ్య. పోశమ్మ అనసూయను లేపి అల్యూమినియం గ్లాసులో వున్న నీళ్ళను తాగించింది. బగోని గిన్నెలో మిగిలిన నీళ్ళు తాను త్రాగి కొంగుతో బిడ్డ మొఖం తుడిచి తన మూతి తుడుచుకుంది.

వాకిట్లో కూర్చున్న ముసలివాళ్ళు బీడీలు, చుట్టలు ముట్టిచ్చుకున్నారు. స్త్రీలు ఆకువక్కలు వేసుకున్నారు.

వసారాలో కూర్చున్న కాపు, సావుకార్లు జరిగిన కథపై చర్చిస్తున్నారు.

తాను ఆలస్యం చేస్తున్నానన్న స్పృహ కలిగి దుర్గయ్య సంజాయిషీగా "రెండు బుక్కలు బీడీ తాగి కథ మొదలు పెడుత పటేలా మీ కాల్మొక్త కుతకెల దమ్ము లేకుంట అయింది"

"తాగు నిమ్మలంగ తాగురా" అన్నాడు రామిరెడ్డి.

వాకిట్లో కూర్చున్న ఒకతని వద్ద ఓడి అడుక్కుని రెండే దమ్ములు తాగాక బీడీని మలిపి చెవి ప్రక్కకు పెట్టుకుని, శారదను చేతిలోకి తీసుకుంటూ

"ఇందుకోసే డిమ్కిని పొద్దు పోతుంది" అని పోశమ్మతో అన్నాడు.

పోశమ్మ అనసూయను తన తొడపై పడుకో బెట్టుకుని డిమ్కి తాళ్ళు బిగించింది.

కథ తిరిగి ప్రారంభమయింది. వచనంతో ప్రారంభించేసి, కథ కొంత జరిగిన తరువాత పాట అందుకున్నాడు దుర్గయ్య.

షోకమల్లు సైన్యానికి తిండి, సుట్ట, పొగాకు ఖర్చులకుగాను దమ్మవ్వ దాచిన ధనం కొల్లగొట్టి పెడతాడు కొండయ్య. పల్గూరి కొండయ్య శత్రువులపై యుద్ధానికి పోయే ముందు తల్లి తన కొడుకు పరాక్రమం చూస్తానంటుంది. అప్పుడు తల్లి, కొడుకుల మధ్య వాగ్వివాదం ఎంత బలంగా, గొప్పగా మానవ జీవితాలను కదిలించే ప్రేమ, అనురాగాలను, ఒక వైపు యుద్ధ చాతుర్యాన్ని పరాక్రమాన్ని, కత్తిసాము మరో వైపు జోడించి ఆశువుగా పాట పాడాడు దుర్గయ్య.

కొండయ్య పరాక్రమాన్ని పరీక్షించి తల్లి దమ్మవ్వ కొడుకును యుద్ధానికి పంపే ఘట్టాలను చెపుతున్నప్పుడు దుర్గయ్య మామూలు మనిషిగా చెప్పడం లేదు. అతడు ఆ సమయంలో ఓ శక్తి-ఓ బలమైన భావం-ఎవ్వరూ ఆర్పలేని జ్వాల-ఎవ్వరూ ఎదురొడ్డలేని సముద్రం ఉప్పెనలా విజృంభించి తనలో వున్న కళా చాతుర్యంతో ఆశువుగా చెప్పుకు



పోతున్నాడు.

జానపద కళా రూపాలను ఇంత ప్రత్యక్షంగా ఇంతకు ముందు చూడ నందుకు సూర్యారెడ్డి తనను తానే నిందించుకున్నాడు. ఆయనలోని కళా హృదయం వెంటనే దుర్గయ్యను కౌగ లించుకుని ఆనంద బాష్పాలతో ముం చెత్తెయ్యాలనిపించింది. సూర్యారెడ్డి గర్వంగా చిరునవ్వు నవ్వుతూ కథ వింటున్నాడు.

దుర్గయ్యకు దగ్గువచ్చింది. కొంత సేపు కథను ఆపి దగ్గి నోట్లోని ఉమ్మిని వాకిట్లో దూరంగా ఊసి కథ ప్రారం భించాడు.

"పెయ్యి బాగలేదారా దుర్గయ్య?" అని వాకిట్లో కూర్చున్న ఓ ముసలా యన అడిగాడు.

దుర్గయ్య ఓ చిరునవ్వు నవ్వి కథలో లీనమైపోయాడు.

కొండయ్య శత్రువులతో యుద్ధం చేస్తున్నప్పుడు చెప్పే సన్నివేశాలప్పుడు దుర్గయ్య భృకుటి ముడి పడటం, ముక్కు పుటాలు అదరడం - కను బొమ్మలు ఎగ రేయడం, కనుగుడ్లు ఉప్పడం, మీసా లను ఎడమ చేతితో బారెడు పొడుగు దూయడం - కథలో పూర్తిగా లీనమై నప్పుడు ఛాతి గుద్దుకోవడం, సందర్భో చితంగా తొడ చరవడం, భూమిమీద గుద్దడం, గాత్రం పెంచి అవలీలగా యుద్ధ వాతావరణాన్ని కళ్ళ ముందు సృష్టించడం కేవలం దుర్గయ్యకే చాత నవుతుంది అని అనుకున్నాడు సూర్యా

రెడ్డి. దుర్గయ్యలోని కళాకారుడు సూర్యారెడ్డి మనసు దోచుకున్నాడు.

అమాంతంగా వెళ్ళి ఆయన (దుర్గయ్య) కాళ్లుపట్టుకొని శరీరాన్నంతా నిమిరి గట్టిగా నుదుటి మీద ముద్దు పెట్టుకోవాలన్నంతగా స్పందింప జేశాడు దుర్గయ్య సూర్యారెడ్డిని.

దుర్గయ్య కథ ఎంత బలంగా చెప్పగలడో, పోశమ్మ అంత బలంగా కథను నడిపిస్తూవున్నది. సందర్భోచితంగాహాస్య మాడుతూ వుంది. పోశమ్మ దుర్గయ్య పక్కన లేకపోతే దుర్గయ్య అంత గొప్పగా చెప్పలేడనే విషయం ప్రేక్షకులకు సులభంగా తెలిసిపోతుంది. అంతటి గొప్ప కళాకారిణి ఆమె. వారి కలయిక అపురూపం.

దుర్గయ్య తన సహజ ధోరణిలో కథ చెప్పుకుంటూ పోతున్నాడు.

పోశమ్మ కడుపులో ఆకలి అధికమవుతున్నది. దుర్గయ్య కడుపుకు కట్టుకున్న బట్ట బిగువుకు చర్మం మండుతూ వుంది. అనసూయ తల్లి తొడపై పడుకుని మూల్గుతూ వుంది. క్రమంగా ఆ మూల్గు అధికమవుతున్నది.

దుర్గయ్య పట్టుదలగా శరీరంలోని సత్తువను కూడదీసుకుని కథను ముందుకు తీసుకపోతున్నాడు.

బల్గూరి కొండయ్య పన్నెండో ఏట వరకు తన తండ్రిని చంపిన మొగలాయిలను; శత్రువులను; పగవారిని అందరిని జయించి; చంపి పన్నెండో ఏట ఆయుష్షు క్షీణించి శత్రుల చేతిలో చావకుండా తన బాకుతోనే పొడుచుకుని కొండయ్య మరణించడంతో కథ ముగిసింది.

పౌరుషాన్ని; పరాక్రమాన్ని; సాహసాన్ని; ధైర్యాన్ని; యదార్థాన్ని; ఆకలిని; ప్రేమానురాగాల్ని దుర్గయ్య ఆకలితో పోటీపడి మూడు గంటలపాటు చెప్పి మెప్పించాడు.

సూర్యారెడ్డి కళ్ళల్లో గొప్ప వెలుగు వెలిగింది. అది దుర్గయ్య పట్ల కృతజ్ఞతా భావం.

కథ ముగిసిన వెంటనే సూర్యారెడ్డి తాత ముత్తరెడ్డి గుణగణాలను; దాన ధర్మాలను పొగడుతూ ఆశువుగా పాట పాడాడు.

ఆ పాట పూర్తికాగానే మంగళహారతి పాట నాలుగు నుడుగులు మాత్రమే పాడాడు. పోశమ్మ అనసూయను క్రింద పడుకోబెట్టి ప్రేక్షకుల వద్దకెళ్ళి వొడిలో డబ్బులు అడుక్కున్నది. ఎవరికి తోచినట్టు వాళ్ళు చిల్లర డబ్బులు వేశారు.

దుర్గయ్య శారదను క్రింద పెట్టి అందెలు జేబులో వేసుకుని రుమాలుతో చెమటను తుడుచుకుని గాలి వచ్చేట్టుగా రుమాలుతో ఊపుకున్నాడు.

పోశమ్మ తన యధా స్థానానికి వచ్చి చిల్లర డబ్బులు దుర్గయ్యకు ఇచ్చింది. అనసూయను ఒడిలో పడుకోబెట్టుకుని కడుపుపై చెయి వేసి చూసింది. ఒళ్ళు కాలిపోతున్నది. గుండెలకు అద్దుకున్నది. దుర్గయ్య పాప మెడమీద చెయివేసి చూసిగ అచేతితో నుదురు కొట్టుకున్నాడు.

కథ వినడానికి వచ్చిన వారందరూ ఎవరి దారినవారు వెళ్ళిపోయారు.

రామిరెడ్డి, రామిరెడ్డి తమ్ముళు. అక్కడినుండి లేచి ఇంట్లోకి వెళ్ళారు



గపపద్ద ఆడవాళ్ళు కూడా ఇంట్లోకి వెళ్ళిపోయారు. వసారాలో సూర్యారెడ్డి, దుర్గయ్య, పోశమ్మ, పోశమ్మ ఒడిలో అనసూయ మాత్రమే మిగిలారు.

పోశమ్మ దుర్గయ్యను చూస్తూ ఆదుర్దాగా

"ఎట్లనయ్య పోరి పెయ్యి ఇంగలం కాలినట్టు కాలుతుంది ఎట్ల చేద్దాం" అంది.

"పార పైసలు ఇస్తే రామారావు డాక్టరు దగ్గర్కి తీసుకపోదాం, సూది మందు యిప్పిద్దాం ... అంతకు మించి మన చేతుల ఏమున్నదే మన నసీబ; ఖర్మ గింత మట్టుకున్నది ఏంజేద్దాం?" అన్నాడు దుర్గయ్య విచారంగా.

"ఎన్నిరోజులైంది ఈ పాపకు జ్వరం వొచ్చి?" సూర్యారెడ్డి చొరవతీసుకుని అడిగాడు.

ఒకేసారి దుర్గయ్య, పోశమ్మ సూర్యారెడ్డి వైపు చూశారు. తమ చెవులను తామే నమ్మలేనట్టుగా అనిపించింది వాళ్ళకు.

"పది, పన్నెండు రోజులైంది నాయనా" అంది పోశమ్మ తేరుకుని.

"ఆ రోజునుంచి డాక్టరుకు చూపించనే లేదా?"

"ఏదో తక్కువైతదిలే అనుకోని అట్లనే వూకున్నం. నాకు తెలిసిన వైద్యం అదీ, ఇదీ జేసినా. అయినాగాని తక్కువగాలేదు. నిన్నటి నుంచి ఇంకా ఎక్కువైంది జరం...."దుర్గయ్య సూర్యారెడ్డి కళ్ళ

లోకి చూస్తూ బొంగురు గొంతుతో అన్నాడు.

"నాకు ఎడమ కాలు నవ పెడుతుంది. కుడి కన్ను అదురుతుంది. నాకెందుకో భయమైతున్నది . " అని పోశమ్మ ఏడుస్తూ దుర్గయ్యతో అన్నది.

దుర్గయ్య ముందు తాను ధైర్యం తెచ్చుకుని

"ఏంగాదు నువ్ బయపడకు. బయపడితే పనులయితాయి? రా మా రా వ్ డాక్టరు మంచిగ సూస్తడు. మందు లిస్తడు తక్కువైతది.. "

"ఏమో నాకు బుగులైతుంది" అంటూ గట్టిగా ఏడ్చింది పోశమ్మ.

సూర్యారెడ్డి మనసు విలవిలలాడింది. ఇంతటి క్లిష్ట సమయంలో తాను ఆ దంపతులకు ఏ విధంగా సహాయపడటం లేదని అతని మనసు మూల్గింది. హైదరాబాద్‌లో ఐతే తనకు తెలిసున్న డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళి చికిత్స చేయించేవాడు పాపకు. మరి ఇక్కడ తనకు ఏ డాక్టరు తెలుసు? అసలు డాక్టరే లేరని గ్రామస్థుల ఫిర్యాదు. ఇంత గొప్పకళాకారులకుఇంత నికృష్టమైన దారిద్ర్యమా? అని ఆలోచిస్తుండగానే గడపవద్ద అడుగుల చప్పుడు వినిపించింది.

రామిరెడ్డి ఇంట్లోనుంచి వసారాలోకి వచ్చాడు. రామిరెడ్డి పటేలును చూసి దుర్గయ్య లేచి నిల్చుని "శారద" ను భుజంపై పెట్టుకున్నాడు. పోశమ్మ జోలె బుజానికి వేసుకుని; డిమ్కి కూడా అదే బుజానికి వేసుకుని; అనసూయను చంకలో ఎత్తుకుని నిల్చున్నది. సూర్యారెడ్డి కూడా నిలుచున్నాడు.

దుర్గయ్య నాలుగడుగులు ముందుకేసి రామిరెడ్డి వద్దకొచ్చాడు. రామిరెడ్డి పటేలు జేబులోంచి ఐదురూపాయల నోటుతీసి దుర్గయ్య చేతిలో పెట్టాడు.

దుర్గయ్య ఆశ్చర్యంగా తన చేతిలో వున్న నోటు వైపు చూసాడు. రామిరెడ్డి కళ్ళలోకి దీనంగా చూస్తూ; అభ్యర్థిస్తున్నట్టుగా

"సరిపోవు పటేలా నీకాల్మొక్త.. ఇంకో పది రూపాయలు ఇయ్యిండ్రి. ముత్తిరెడ్డి పటేలు చచ్చి స్వర్గాన పోయిండు. ఆ దొర పేరు మీద కథ చెప్పిన. పుణ్యాత్ముడు, ధర్మ ప్రభువు పేరుమీద ఇంకో పది రూపాయలు ఈ బిక్షగానికి ఇయ్యిండ్రి పటేలా నీ కాల్మొక్త " అడిగాడు.

"యిప్పుడైతే లేవు మల్లొకసారి చూద్దాంపో....యిప్పుడు ఈ ఐదు రూపాయలు తీసుకపో " అన్నాడు తేలిగ్గా రామిరెడ్డి.

"పటేలా నీ కాల్మొక్త.. " అంటూ దుర్గయ్య రామిరెడ్డి కాళ్ళమీద పడ్డాడు. పోశమ్మ మనసు తూట్లు పడింది. దీనంగా తదేకంగా నేలను చూస్తూవుంది. సూర్యారెడ్డి చేతులు కట్టుకుని పండ్లు ఓగపట్టి రామిరెడ్డి మామవంక చూస్తున్నాడు.

"లేవని చెబుతున్న కదరా కాళ్ళు పట్టుకుంటే యేడికెల్లొస్తయ్ . ముందు కాళ్ళు యిడువ్ ." అని కఠినంగానే అన్నాడు రామిరెడ్డి.

దుర్గయ్య మనసులో తుఫానులు చెలరేగాయి; పెనుగాలులు వీచాయి. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభమయింది. శరీరం ఊగుతుంది. కళ్ళు తిరుగుతున్న

ట్టనిపిస్తూ వుంది. చెవుల్లో హోరుగాలి వీస్తుంది. భూమిలో తాను కూరుకు పోతున్నట్టనిపించింది. దిక్కులన్నీ వణుకుతున్నట్టనిపించింది. ఈ ప్రపంచమంతా అయోమయంగా కనిపించింది. అంతా చీకటిగా గోచరించింది. . రెండు క్షణాలు కళ్ళు మూసుకుని తేరుకున్న తరువాత సూటిగా రామిరెడ్డి కళ్ళలోకి చూస్తూ

"పటేలా మీ కాల్మొక్త పోరి పది పన్నెండు రోజులసంది బాగలేదు. కడుపులకు తిండిలేక మలమల మాడి సస్తున్నం. పోరికి మందు లేదు. మాకు తిండి లేదు. ఇంట్ల ఇత్తులేదు. ఉపాసంతోటి పొద్దు గడుపుతున్నం. కడుపుకు బట్ట కట్టుకొని బల్లూరి కొండయ్య కథ చెప్పిన కండ్లకు నెత్తురొస్తుంది...కథ చెప్పినందుకు ఇంకో పది రూపాయలు ఇయ్యండ్రి దొరా.. " అని అడిగాడు

"ఇట్ల షరతుజేస్తె ఎట్లరా?. నాయన సచ్చి ఖర్సుర పడ్డనేను-నువ్వు యిప్పుడే పంగిల బాగోత మాడిచ్చినట్టు చేస్తె ఎట్లయితది.. ఆఁ .. ఇగో ఈ రెండు రూపాయలు తీసుకొని పో .. యింక నన్ను సతాయింపకు..." అని రామిరెడ్డి జేబులోంచి రెండు రూపాయల కాగితాన్ని తీసి దుర్గయ్య చేతిలో పెట్టాడు.

పోశమ్మ కళ్ళలోకి నీళ్ల తీసుకుని పెదవులను బిగపట్టి హృదయ భారాన్ని ఆపుకుంది - దుర్గయ్య దగ్గరకు వచ్చి చెయ్యి పట్టుకుని

"పోదాం....పా" అంది మెల్లిగా.

దుర్గయ్య మనసులో ఉప్పెన ఉధృతి ఎక్కువైంది. మనసు సుడిగాలిలో చిక్కుకపోయింది. అనసూయ ఆకారం, ఇంట్లో గింజలులేని కుండలు... రామిరెడ్డి పటేలు గొంతు తనను వెక్కిరిస్తున్నట్టనిపించింది. దుర్గయ్య చుట్టూ సమస్యలు - సమస్యల వొత్తిడి.

సూర్యారెడ్డి కుడికాలి బొటన వేలుతో భూమిమీద గీతలు గీస్తున్నాడు-అప్రయత్నంగానే పిడికిలి బిగుసుకుంది. మనసులోని కోపం కళ్ళలోకి ఎర్రగా పాకింది.

దుర్గయ్య పోశమ్మ చేయి పట్టుకుని రెండు అడుగులు ముందుకు వేశాడు. సూర్యారెడ్డి వాళ్ళను అపుదామని కట్టుకున్న చేతులను వదిలేసాడు.

"సూర్యం మీ అత్త పిలుస్తుంది పో"

అన్న రామిరెడ్డి గొంతు సూర్యారెడ్డిని ఆపేసింది.

అప్పటికే దుర్గయ్య, పోశమ్మ వాకిలి దాటి, గేటు దాటారు.

పట్టరాని కోపం, తిరుగుబాటుతత్వం, ఆరాటం నిలువెల్ల దహించి వేస్తుంటే సూర్యారెడ్డి గడపలో కాలుపెట్టాడు. అంతే..

గేటుముందు మనిషి పడిపోయిన చప్పుడు-'శారద' తీగెలు తెగిన శబ్దం గాలిలో సుడులు తిరుగుతోంది. అందెలు దొర్లుకుంటూ పోయి దూరంగా పడ్డాయి.

తలరుమాలు ఊడిపోయింది.పోశమ్మ దుర్గయ్యమీద పడి కట్టలు తెగిన ప్రవాహంలా ఏడుస్తున్నది. అనసూయ కళ్లు తెరచి నిర్జీవంగా తండ్రివంక చూసింది. ★